ముత్తా గూర్కా వాడి వెనక్కి వెళ్ళి నిలబడ్డారు. కామాక్షి మొగుడు వాళ్ళ ముగ్గురే తన పెళ్ళాన్ని ఇంటికి రాకుండా చేస్తున్నారని గోలచేయడం మొదలెట్టాడు. వాళ్ళని గేటు దాటి బయటకు రమ్మని సవాల్ చేశాడు. ఒక్కొక్కళ్ళని నరికి పోగులు పెడ్తానని బెదిరించాడు.

ఆ రోజునుంచి వాడి భయానికి పనివాళ్ళు సినిమాకు పోవడం కూడా మానేశారు. అంతకుముందు రెండో ఆటకు వెళ్ళే రెడ్డి గేటు దాటడానికే జంకేవాడు 'ఏమో ! తాగుమోతు వాడు. అందులో వార్నీషు తాగే వెధవ. తెగించి కక్షతో ఏం చేస్తే ఏంగతి? పిచ్చివాడి చేతిలో రాయి.'

చివరకు గడియ గడియకు టీ నీళ్ళు తాగొచ్చే నాగప్ప టీ తాగడం మానేశాడు. వా డక్కడే ఉంటాడని చెప్పా రెవరో. కామాక్షి యింటికి వెళ్ళి రెండు రోజులైంది. రోజూ దాని మొగుడు గేట్లోకి రావడం, కబురు పెట్టడం జరుగుతూనే ఉంది. కాని రెడ్డి, వంటవాడూ, నాగప్పా, ఎవరూ గేటువేపు వెళ్ళలేదు.

కామాక్షి మొగుడు విషం తిని చచ్చి పోతానని బెదిరిస్తూ జాబురాశాడు దానికి. 'తొందరగా పొమ్మను' అన్నారు రెడ్డి, నాగప్పా, వంటవాడు.

కానీ పిండి రుబ్బుతున్న కామాక్షి జాబు చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. గేటుదాకా వెళ్ళి మొగుడ్తో రెండు మాటలు మాట్లాడివస్తానని చేతులు కడుక్కుంది. 'వాడితో కూడ యింటికి వెళ్ళొద్దు' అని నాగప్పా, వంటవాడూ, రెడ్డి ప్రాధేయపడ్డారు, మా అత్తగారికి తెలియకుండా. పోనని

